సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం । 13 । మార్చి । 2025



ఆక్వా రైతు కుదేలు
కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఆక్వా రంగం కుదేలవుతుంది. సరైన ధర లేక రైతులు నష్టాలు చవిచూస్తున్నారు.
8లో



11 మందికి గాయాలు
ఏలూరులో జాతీయ రహదారిపై రెండు చోట్ల జరిగిన బస్సు ప్రమాదాల్లో 11 మంది ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు.
8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ గురువారం (సాయంత్రం)	సహరి శుక్రవారం (ఉదయం)
భీమవరం	6.19	4.53
నరసాపురం	6.19	4.51
తాడేపల్లిగూడెం	6.14	5.01

న్యూస్‌రీల్

సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలి



పూల ప్రదర్శన తిలకిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం: రైతులు అధిక ఆదాయం పొందేందుకు పూల సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి చెప్పారు. బుధవారం భీమవరం పట్టణం ఆనంద ఇన్‌లో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పూలసాగు–ఉద్యాన విలువ ఆధారిత ఉత్పత్తులపై అవగాహన సదస్సు, రైతులకు శిక్షణ తరగతుల కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో ఎక్కువ నీటి నిల్వలు ఉన్న ప్రాంతాలను గుర్తించి పూల్ మకాన్ సాగుపై దృష్టి సారించాలన్నారు. జిల్లాలోని పెనుగొండ, సిద్ధాంతం ప్రాంతాల్లో కూరగాయలు సాగు చేస్తున్నారని, జిల్లాలో పువ్వుల సాగుకు అనువైన ప్రాంతాలను గుర్తించి రైతులను అవగాహన కల్పించి ప్రోత్సహించాలన్నారు. రైతులు అధిక ఆదాయం వచ్చే ఉద్యాన పంటల వైపు పంట మార్పిడి చేయాలన్నారు. పాలీహౌస్ నిర్మాణానికయ్యే ఖర్చులో 50 శాతం రాయితీగా గరిష్టంగా ఎకరానికి రూ.16 లక్షల రాయితీ ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో కేవీకే హెడ్ డాక్టర్ మల్లికార్జున్, డైరెక్టర్ ఆఫ్ ఫ్లోరికల్చర్ డాక్టర్ డీవీఎస్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ప్రభుత్వ ఆస్పత్రి పరిశీలన



భీమవరం ఏరియా ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులతో కేంద్ర బృందం సభ్యుల సమావేశం

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం ఏరియా ప్రభుత్వ ఆస్పత్రిని బుధవారం కేంద్ర బృందం పరిశీలించింది. టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర వైద్య బృంద సభ్యులు డాక్టర్ నీరదా, డాక్టర్ సందీప్ భీమవరం ప్రభుత్వ ఆస్పత్రిలోని టీబీ విభాగం, ఆస్పత్రిలోని ల్యాబ్‌లు, వార్డులు తదితర వాటిని పరిశీలించారు. టీబీకి సంబంధించి ఆస్పత్రి వైద్యులకు, సిబ్బందికి పలు అంశాలపై అవగహన కల్పించారు.

నేడు ఉద్యాన వర్సిటీలో అంతర్జాతీయ సదస్సు

తాడేపల్లిగూడెం: వెంకట్రామన్నగూడెం వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో గురువారం అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నారు. ఉద్యాన వర్సిటీ వీసీ డాక్టర్ కే.గోపాల్ బుధవారం వివరాలు వెల్లడిస్తూ.. వివిధ దేశాల్లో విస్తృతంగా సాగు చేస్తున్న ఉద్యాన పంటలు, దేశంలోని భిన్నమైన వాతావరణ పరిస్థితుల్లో సాగు చేయడానికి అనుకూల అంశాల గురించి ఈ సదస్సులో అధ్యయనం చేస్తారన్నారు. వివిధ దేశాల శాస్త్రవేత్తలతో చర్చించి, ఉద్యాన, వాణిజ్య పంటలు మన రాష్ట్రంలో సాగుచేయడానికి వీలుగా తగిన పద్ధతులు రూపొందించేందుకు ఈ సదస్సు ఉపయోగపడుతుందన్నారు. వియత్నాం, శ్రీలంక, అమెరికా తదితర దేశాలకు చెందిన ప్రొఫెసర్లు, శాస్త్రవేత్తలు ఆన్‌లైన్ విధానంలో పాల్గొంటారన్నారు. బెంగళూరు జాతీయ ఉద్యాన పరిశోధనా సంస్థ శాస్త్రవేత్తలు సదస్సులో పాల్గొంటారన్నారు. అమెరికాలోని అబర్న్ విశ్వవిద్యాలయంలో సీనియర్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ప్రఖ్యాత ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.ఎస్.రెడ్డి ముఖ్య సందేశం ఇస్తారన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

భీమవరం: జిల్లాలోని 52 పరీక్షా కేంద్రాల్లో బుధవారం నిర్వహించిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం జనరల్ పరీక్షకు 15,296 మందికి 14,831 మంది విద్యార్థులు హాజరుకాగా, ఒకేషనల్ పరీక్షకు 1,543 మంది విద్యార్థులకు 1,442 మంది హాజరయ్యారని డీఐఈవో ఎ నాగేశ్వరరావు తెలిపారు. ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదుకాలేదు.

నిధుల దుర్వినియోగం కేసులో ఇద్దరి అరెస్టు

భీమవరం: భీమవరం మండలం చినఅమిరం, రాయలం గ్రామ పంచాయతీల్లో నిధుల దుర్వినియోగం కేసుల్లో ఇద్దరిని అరెస్టు చేసినట్లు భీమవరం టూటౌన్ పోలీసులు తెలిపారు. రెండు పంచాయతీల్లో గతంలో పంచాయతీ కార్యదర్శులుగా పనిచేసిన సాగిరాజు కిషోర్‌కుమార్‌రాజు, దున్న జయరాజు కోట్లాది రూపాయలు దుర్వినియోగం చేసినట్లు జిల్లా ఉన్నతాధికారుల విచారణలో తేలడంతో పోలీసులకు ఫిర్యాదు అందింది. కేసు విచారణ చేసి కిషోర్ కుమార్‌రాజు, జయరాజును బుధవారం అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వంచనపై గర్జన

వైఎస్సార్‌సీపీ 'యువత పోరు' విజయవంతం

- కదంతొక్కిన పార్టీ శ్రేణులు
- భారీ ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకుని నిరసన
- ఫీజు బకాయిలు విడుదల చేయాలి
- నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్



భీమవరం కలెక్టరేట్ వద్ద వైఎస్సార్‌సీపీ శ్రేణుల నిరసన

సాక్షి, భీమవరం/భీమవరం: నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇస్తామని, తల్లికి వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పేదల చదువుకు ప్రోత్సాహం అందిస్తామని చేసిన వాగ్దానాలను విస్మరించి దగాకోరు పాలన సాగిస్తున్న కూటమి సర్కారుపై ప్రజలు, విద్యార్థి సంఘాలు కదం తొక్కాయి. కూటమి పాలనలో దగాపడిన నిరుద్యోగ యువత, విద్యార్థుల పక్షాన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపునిచ్చిన 'యువత పోరు'కు అనూహ్య స్పందన వచ్చింది. జిల్లాలోని తణుకు, తాడేపల్లిగూడెం, నరసాపురం, పాలకొల్లు, ఆచంట, ఉండి, భీమవరం నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, ప్రజలు జిల్లా కేంద్రమైన భీమవరం తరలివచ్చారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు నేతృత్వంలో పట్టణంలోని విస్సాకోడేరు వంతెన నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లు మెగా డీఎస్సీ నిర్వహించాలని, 20 లక్షల ఉద్యోగాలు ఇవ్వాలని, నిరుద్యోగులకు నెలకు రూ. 3 వేలు చొప్పున నిరుద్యోగ భృతి చెల్లించాలని, జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని, తల్లికి వందన, విద్యా, వసతి దీవెన ఫీజు బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ గేటు వద్ద జిల్లా అధ్యక్షుడు ప్రసాదరాజు, మాజీ మంత్రులు కారుమూరి నాగేశ్వరరావు, కొట్టు సత్యనారాయణ, నరసాపురం పార్లమెంట్ ఇన్‌చార్జి గూడూరి ఉమాబాల తదితరులు ప్రసంగించారు. అనంతరం కలెక్టరేట్‌లో డీఆర్‌ఓ మొగలి వెంకటేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు, ఉండి, పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జిలు పీవీఎల్ నర్సింహరాజు, గూడాల శ్రీహరి గోపాలరావు(గోపి), నరసాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, పార్టీ జిల్లా అధికారప్రతినిధి కామన నాగేశ్వరరావు, మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ బంధన పూర్ణచంద్రరావు, జిల్లా యువత అధ్యక్షుడు చిగురుపాటి సందీప్, పార్టీ నేతలు చినమిల్లి వెంకట్రాయుడు, పెండ్ర వీరన్న, చెల్లెం ఆనందప్రకాష్, గుణ్ణం నాగబాబు, మద్దా చంద్రకళ, కర్రా జయచరిత, చెరుకూరి కుమారదత్తాత్రేయవర్మ తదితరులు పాల్గొన్నారు.



భీమవరం యువత పోరు ర్యాలీలో పార్టీ అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, మాజీ మంత్రులు కొట్టు సత్యనారాయణ, కారుమూరి నాగేశ్వరరావు, శ్రీరంగనాథరాజు సమన్వయకర్తలు పీవీఎల్, గోపి, ఉమాబాల



తణుకు రాష్ట్రపతి రోడ్డులో యువత పోరులో మాజీ మంత్రి కారుమూరి, కళాశాలల విద్యార్థులు



డీఆర్వో వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందిస్తున్న పార్టీ నేతలు



అత్తిలి: వైఎస్సార్‌సీపీ యువత పోరుకు సంఘీభావం తెలుపుతున్న అత్తిలి డిగ్రీ కళాశాల విద్యార్థులు

ప్రజల పక్షాన పోరుబాట



ఆరు అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నేడు రైతులు, మహిళలు, విద్యార్థులను రోడ్డు మీద నిలబెట్టారు. రైతులు, విద్యుత్ చార్జీల పెంపుతో నష్టపోతున్న వినియోగదారుల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాటం చేసింది. ఇప్పుడు నిరుద్యోగ యువత, విద్యార్థులకు అండగా నిలబడుతున్నాం. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన, విద్యా దీవెనకు ఒక్క రూపాయి జమ చేయలేదు. అమ్మ ఒడిని పూర్తిగా ఆపేశారు. మా ప్రభుత్వంలో 17 మెడికల్ కళాశాలలు మంజూరు చేసి ఐదింటిని ప్రారంభించాం. మిగిలిన వాటి పనులు ముందుకు సాగకుండా కూటమి ఆపేసింది. వెంటనే ఫీజు బకాయిలు విడుదల చేయడంతో పాటు నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పన, నిరుద్యోగభృతి అందించేందుకు చర్యలు చేపట్టాలి.

– ముదునూరి ప్రసాదరాజు, జిల్లా అధ్యక్షుడు

విద్యార్థులను రోడ్డున పడేశారు



కూటమి ప్రభుత్వం అబద్ధపు హామీలతో పేద విద్యార్థుల చదువులను రోడ్డు మీదకు తెచ్చింది. కళాశాలలకు ఫీజులు కట్టలేక విద్యార్థులు చదువులు మధ్యలో ఆపేసి మట్టి పనులకు వెళ్లాల్సిన దుస్థితి. వైఎస్సార్‌సీపీ తెచ్చిన మెడికల్ కళాశాలల నిర్మాణాలను కూటమి అసంపూర్తిగా ఆపేసింది. 20 లక్షల మంది నిరుద్యోగులకు నెలకు రూ. మూడు వేలు చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని ఎన్నికల్లో చెప్పిన చంద్రబాబు బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు.

– కొట్టు సత్యనారాయణ, మాజీ మంత్రి

తల్లికి వందనమని వంచించారు



తల్లికి వందనం ఇస్తామని చెప్పి వంచించారు. గత బడ్జెట్‌లో రూ.5 వేల కోట్లు చూపించి చివరికి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. ఫీజు రియంబర్స్‌మెంట్ లేదు, విద్యా దీవెన లేదు, వసతి దీవెన లేదు, అన్ని రకాలుగా కూడా ఇబ్బంది పెట్టే కార్యక్రమం చేస్తున్నారు. ఏ గ్రామం వెళ్లినా యువత కూటమి ప్రభుత్వం మమ్మల్ని వెన్నుపోటు పొడిచి, నట్టేట ముంచారని ఆవేదన చెందుతున్నారు. 750 మెడికల్ సీట్లు వద్దని లేఖరాసిన ఏకైక సీఎం చంద్రబాబు. ఇప్పటికైనా కళ్లు తెరిచి పేద విద్యార్థులు, యువతకు న్యాయం చేయాలి.

– కారుమూరి నాగేశ్వరరావు, మాజీ మంత్రి

హామీలను గాలికొదిలేశారు



ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో ఎంతోమంది పేద విద్యార్థులు ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారు. తండ్రిని మించి తనయుడిగా మాజీ సీఎం జగనన్న నాడు–నేడు, విద్యా, వసతి, విదేశీ విద్యా దీవెనలతో పేదల ఉన్నతికి ఎంతో తోడ్పాటును అందించారు. అధికారం ఉన్నా లేకపోయినా వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ ప్రజల సంక్షేమానికి పాటుపడుతుంది. నేటి బాలలే రేపటి పౌరులని వారి చక్కటి భవిష్యత్‌కు మాజీ సీఎం జగన్ బాటలు వేశారు.

– గూడూరి ఉమాబాల, నరసాపురం పార్లమెంట్ ఇన్‌చార్జి



నరసాపురం పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పార్టీ నాయకులు



పాలకొల్లులో కేక్ కట్ చేస్తున్న సమన్వయకర్త గుడాల గోపి, పార్టీ నాయకులు



తూర్పుపాలెంలో వైఎస్సార్‌సీపీ పతాకావిష్కరణ చేస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

వాడవాడలా సంబరాలు

- ఘనంగా వైఎస్సార్‌సీపీ 15వ ఆవిర్భావ దినోత్సవం
- జిల్లా వ్యాప్తంగా పార్టీ జెండా రెపరెపలు
- మహానేతకు ఘనంగా నివాళులు



పెదఅమిరంలోని జిల్లా కార్యాలయం వద్ద వేడుకల్లో జిల్లా అధ్యక్షుడు ప్రసాదరాజు, మాజీ మంత్రి కొట్టు, సమన్వయకర్తలు పీవీఎల్, గోపి, ఉమబాల తదితరులు

సాక్షి, భీమవరం: పేదల గుండె చప్పుడుగా.. అణగారిన వర్గాల ఆశాజ్యోతిగా ఆవిర్భవించిన వైఎస్సార్‌సీపీ 15వ ఆవిర్భావ దినోత్సవం బుధవారం వాడవాడలా వేడుకగా జరిగింది. పార్టీ శ్రేణులు గ్రామ గ్రామన జెండా ఆవిష్కరించి సంబరాలు చేసుకున్నారు. కేక్ కటింగ్‌లు చేసి దివంగత వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఢిల్లీ నుంచి గల్లీ దాకా రాజకీయ పార్టీలు ఏకమై వైఎస్సార్‌సీపీకి వ్యతిరేకంగా చేసిన కుట్ర రాజకీయాలు, అంతులేని జనాభిమానంతో రాష్ట్రంలో ఎదురులేని పార్టీగా నిలవడంలో అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాగించిన పోరాటాన్ని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న వంచనపై పేదల పక్షాన మరోమారు పార్టీ శ్రేణులు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. స్థానిక పెద అమిరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి. మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ, ఉండి, పాలకొల్లు ఇన్‌చార్జిలు పీవీఎల్ నరసింహరాజు, గుడాల శ్రీహరిగోపాలరావు, నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడూరి ఉమాబాల, భీమవరం ఎంపీపీ పేరిచర్ల నరసింహరాజు, భీమవరం అర్బన్, రూరల్ అధ్యక్షులు గాదిరాజు రామరాజు, జల్లా కొండయ్య, సేవాదళ్, సోషల్ మీడియా, యువజన విభాగం జిల్లా కన్వీనర్లు చినమిల్లి వెంకట్రాయుడు, బంధన పూర్ణచంద్రరావు, చిగురుపాటి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

- తణుకు నియోజకవర్గంలో వేడుకలు ఘనంగా జరిగాయి. తణుకులోని పార్టీ కార్యాలయం వద్ద మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించి మిఠాయిలు పంచారు.
- ఆచంట నియోజకవర్గం తూర్పుపాలెంలోని పార్టీ కార్యాలయం వద్ద నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు పార్టీ జెండాను ఆవిష్కరించారు. జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.
- తాడేపల్లిగూడెంలోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ పార్టీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు స్వీట్లు పంచారు. పట్టణ కన్వీనర్ కొలుకులూరి ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.



తణుకులో వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి కారుమూరి

- పాలకొల్లులో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరిగోపాలరావు పార్టీ జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. అందరికి స్వీట్లు పంచి శుభాకాంక్షలు తెలిపారు.
- నర్సాపురంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రె శ్రీవెంకటరమణ, పార్టీ కేంద్ర పాలక మండలి సభ్యుడు పీడీ రాజు, ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పెండ్ర వీరన్న, ఇతర నాయకులు పాల్గొన్నారు.
- భీమవరం నియోజకవర్గం వీరవాసరంలో పార్టీ మండల కన్వీనర్ సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించి అందరికి స్వీట్లు పంచారు.
- ఉండి నియోజకవర్గంలో ఆకివీడు మండలం చెరుకుమిల్లిలో పార్టీ నాయకుడు మంతెన సునీల్ కుమార్ ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు.

వైఎస్సార్ ఆశయాలే పార్టీకి జీవం

కాళ్ల: దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆశయాలే వైఎస్సార్‌సీపీకి జీవమని పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాద రాజు అన్నారు. కాళ్ల మండలం పేద అమీరంలో ఉన్న జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద రాజు మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ మరణానంతరం ఆయన పాలన కొనసాగించేందుకు రాష్ట్ర ప్రజల కోసం వైఎస్సార్ అభిమానుల కోసం వైఎస్సార్‌సీపీ ఉద్భవించిందన్నారు. రాష్ట్రంలో ఉన్న రైతులు, కార్మికులు, శ్రామికులు, యువత ఆదర్శంగా పార్టీ రూపుదిద్దుకుందని చెప్పారు. ఒక ఎమ్మెల్యే, ఒక ఎంపీతో మొదలైన ప్రస్థానం నేడు ఎంతోమంది సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలతో దేశం మొత్తం రాష్ట్రం వైపు చూసేలా పార్టీ పటిష్టంగా ఉందన్నారు. అధికారం ఉన్నా.. లేకపోయినా ప్రజల పక్షాన పోరాటం చేస్తామన్నారు. ప్రజల పక్షాన నిలబడి రైతులు, విద్యార్థుల కోసం పోరాటం చేస్తున్నామన్నారు.

క్లుప్తంగా

ముగింపు దశకు పెద్దింట్లమ్మ జాతర


కొల్లేటికోట పెద్దింట్లమ్మ తల్లి

కైకలూరు: కొల్లేటి కోట పెద్దింట్లమ్మ జాతర ముగింపు దశకు చేరింది. ఈ నెల 1న ప్రారంభమైన జాతర గురువారంతో ముగియనుంది. ప్రధాన అర్చకులు పేటేటి పరమేశ్వరశర్మ బుధవారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి వస్త్ర, పుష్పాలంకరణ, ఉచిత ప్రసాద దాతలుగా కైకలూరుకు చెందిన పోతునూరి మణికుమార్, తణుకు పట్టణానికి చెందిన ఉంగరాల కిషోర్, లక్ష్మీపురం గ్రామానికి చెందిన కాటూరి జగదీష్ వ్యవహరించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా కైకలూరుకు చెందిన కురేళ్ళ జ్యోతి ఆధ్వర్యంలో జరిగిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాస్ మాట్లాడుతూ గురువారం రాత్రి తెప్పోత్సవం జరుగుతోందని భక్తులు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు.

ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి


డీఈవో నారాయణకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

భీమవరం: నూతన విద్యాసంవత్సరం ప్రారంభం కాకుండానే అడ్మిషన్లు, ప్రచారాలు చేస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా విద్యాశాఖాధికారి ఇ నారాయణకు వినతిపత్రం అందజేశారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు బి.గణేష్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా జిల్లాలోని కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు తమ సిబ్బందిని ఇంటింటికీ పంపించి విద్యార్థుల అడ్మిషన్లపై ఒత్తిడి చేస్తున్నారన్నారు. అటువంటి విద్యాసంస్థలపై శాఖాపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఎస్ లక్ష్మణ్, బి సింధు, భాగ్యలక్ష్మి తదితరులున్నారు.

క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామని మోసం

భీమవరం: క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామంటూ గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి తనను మోసం చేశారని రేవు జగన్ మోహన్ అనే వ్యక్తి టూటౌన్ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. జగన్‌మోహన్‌కు గత నెల 26న ఒక వ్యక్తి ఫోన్ చేసి కార్డుల లిమిట్ పెంచుతామని నమ్మించాడు. అది నమ్మిన జగన్ మోహన్ అతను పంపించిన లింక్‌ను క్లిక్ చేశాడు. దీంతో అతని అకౌంట్లో ఉన్న రూ.3,48,428 అగంతకుడు అకౌంట్లోకి వెళ్ళిపోవడంతో కంగుతిన్నాడు. టూటౌన్ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అభివృద్ధి పనులు వేగంగా పూర్తిచేయాలి

ఏలూరు (మెట్రో): జిల్లాలో గ్రామీణ అభివృద్ధి పనులు వేగంగా పూర్తయ్యేలా అధికారులు కృషి చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. బుధవారం జెడ్పీ కార్యాలయంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో రహదారి పనుల పురోగతిపై ఆమె సమీక్షించారు. అనంతరం జెడ్పీ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా ఉద్యోగులకు పురస్కారాలను అందజేశారు. జెడ్పీ సీఈవో కె.భీమేశ్వరరావు, మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా రైతు కుదేలు

- గిట్టుబాటు ధర రాక రైతుల గగ్గోలు
- ఎగుమతిదారుల సిండికేట్‌తో రొయ్యల ధర నేలచూపులు
- భారీగా పెరిగిపోయిన ఆక్వా ఫీడ్, మందుల ధరలు
- రొయ్యల రైతుల కష్టాలను పట్టించుకోని కూటమి ప్రభుత్వం


వీరవాసరంలో రొయ్యల రైతుల ధర్నా (ఫైల్)



వీరవాసరం: రొయ్య రైతుల సమస్యలను కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఆక్వా రంగం కుదేలవుతుంది. పెరుగుతున్న పెట్టుబడి వ్యయానికి తగ్గట్టు ఉత్పత్తి అయిన రొయ్యలకు సరైన ధర లభించకపోవడంతో ఆక్వా రైతులు నష్టాలను చవిచూస్తున్నారు. రొయ్యల ఎగుమతిదారులు సిండికేట్‌గా తయారై ఆక్వా ఉత్పత్తులను ఎగుమతి అయ్యే సమయానికి ఇష్టారాజ్యంగా ధరలను తగ్గించడంతో రైతులకు నష్టాలు తప్పడం లేదు.

ఆకాశాన్నంటుతున్న ఫీడ్, మందుల ధరలు

పశ్చిమగోదావరి జిల్లాలో 18,923 ఎకరాల్లో రొయ్యల సాగు జరుగుతోంది. వందలాది కుటుంబాల వారు ఆక్వా రంగంలో కార్మికులుగా జీవనోపాధి పొందుతున్నారు. ప్రస్తుతం ఆక్వా ఫీడ్, మందుల ధరలు భారీగా పెరిగిపోవడం, నాణ్యమైన సీడు లభించకపోవడంతోపాటు నిత్యం రొయ్యల ధరలు నేలచూపులు చూడడం వంటి కారణాలతో ఆక్వా రంగం ఉక్కిరిబిక్కిరి అవుతోంది. పదేళ్ల క్రితం కేజీ 100 కౌంట్ రొయ్యల ధర రూ.240 నుంచి 250 ఉండగా ప్రస్తుతం రూ.225 నుంచి 230 వరకు ఉంది. కానీ గతంలో కేజీ ఒక్కింటికి రూ.70 నుంచి 72 పలికిన రొయ్యల ఫీడ్ ధర ప్రస్తుతం 94 నుంచి రూ.97 వరకు పెరిగిపోయింది. అలాగే మెడిసిన్ ధరలు పదేళ్ల నాటితో పోలిస్తే 50 నుంచి 60 శాతం పెరిగిపోయాయి. కానీ రొయ్యల ధరలు మాత్రం పెరగలేదు. ఒక కేజీ 100 కౌంట్ రొయ్య ఉత్పత్తి చేయాలంటే ఫీడ్, సీడ్, మెడిసిన్, లీజు, ఇతర ఖర్చులు కలిపి రూ.260 నుంచి 275 వరకు ఖర్చు అవుతుంది. కనీసం ఉత్పత్తి ఖర్చు కూడా రాకపోవడంతో నిత్యం రొయ్యల రైతులు నష్టాల బారిన పడుతున్నారు.

కూటమి ప్రగల్భాలు

గత 15 రోజుల క్రితం విజయవాడలో నిర్వహించిన ఆక్వా ఫెస్ట్‌లో రైతులు తమను ఆదుకోవాలంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, రాష్ట్ర మంత్రి అచ్చెం నాయుడు తదితరులకు వినతి పత్రం అందజేశారు. ఈ ఆక్వా ఫెస్ట్‌లో ఆక్వారంగాన్ని ఎక్కడికో తీసుకెళ్తానని ప్రభుత్వ పెద్దలు ప్రగల్భాలు పలికారు. తర్వాత మూడు నాలుగు రోజులకు ఏమైందో కానీ పరిస్థితి దానికి భిన్నంగా తయారైంది. ఆక్వా ఎగుమతిదారుల గుత్తాధిపత్యం కారణంగా టన్నుకు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు ధరలు తగ్గించడంతో ఆక్వా రైతులు లబోదిబోమంటున్నారు. గత ప్రభుత్వంలో అప్సడా ద్వారా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిత్యం చర్చలు జరుపుతూ రొయ్యల రైతులకు అండగా నిలిచారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రొయ్యల ఎగుమతి దారులకు, రొయ్యల ఫ్యాక్టరీ యజమానులకు, ఫీడ్ మందుల కంపెనీలకు కొమ్ముకాస్తూ తమను నట్టేట ముంచుతోందని ఆక్వా రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండించిన పంటకు గిట్టుబాటు ధరలు లేక ఇటీవల రొయ్యల రైతులు ఆందోళన బాట పట్టారు. తమను ఆదుకోవాలంటూ నిరసనలు చేశారు.

రొయ్యల ధరలను స్థిరీకరించాలి



15 రోజుల క్రితం 100 కౌంటు కిలో రొయ్యల ధర రూ.260 ఉండేది. ఒక్కసారిగా 100 కౌంట్ రొయ్యల ధర కేజీ ఒక్కింటికి రూ.225 చేసేశారు. రొయ్యల ఎగుమతిదారులు సిండికేట్ అయ్యి ఇష్టానుసారంగా ధరలను తగ్గించేస్తుండడంతో రైతులు నష్టపోతున్నారు. ప్రభుత్వం రొయ్యల ధరలను స్థిరీకరించి రైతులను ఆదుకోవాలి.

సర్వేశ్వరరావు, వీరవాసరం మండల రొయ్యల రైతుల అసోసియేషన్ కార్యదర్శి

ఇళ్ల స్థలాల కోసం 15న ధర్నా


మాట్లాడుతున్న భీమారావు

భీమవరం: అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీన జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు తెలిపారు. బుధవారం పట్టణంలోని దుర్గాపురంలో ఇళ్లు లేని పేదలతో ఇంటి స్థలాల అర్జీలు పూర్తిచేయించిన సందర్భంగా భీమారావు మాట్లాడారు. అర్హులైన పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడుసెంట్లు ఇళ్ల స్థలాలు ఇస్తామని ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీని తక్షణమే అమలు జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యుడు మల్లుల శ్రీనివాస్, ప్రజానాట్యమండలి నాయకులు ఛాన్ భాషా, మహిళా నాయకులు కొల్లి సుహాసిని, కె మల్లేశ్వరి, పులిదిండి జాన్సీరాణి, గడిమెళ్ళ కాంతామణి, వర్ల కుమారి, గుత్తుల రాణి తదితరులు పాల్గొన్నారు.

రెండు వేర్వేరు బస్సు ప్రమాదాలు


ఏలూరు రామచంద్ర ఇంజనీరింగ్ కాలేజీ వద్ద ప్రమాదంలో దెబ్బతిన్న లారీ


ఏలూరులో గురుకుల పాఠశాల వద్ద ప్రమాదంలో దెబ్బతిన్న ఆర్టీసీ బస్సు

11 మందికి స్వల్ప గాయాలు

ఏలూరు టౌన్: ఏలూరులో జాతీయ రహదారిపై రెండు చోట్ల జరిగిన వేర్వేరు బస్సు ప్రమాదాల్లో 11 మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. బుధవారం వేకువజామున సుమారు 4.30 గంటల ప్రాంతంలో ఏలూరు జాతీయ రహదారిలోని రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో ముందు వెళుతున్న లారీని ఓవర్‌టేక్ చేయబోయి కాకినాడ నుంచి గుంటూరు వెళుతున్న ఆర్టీసీ కాకినాడ డిపోకు చెందిన (ఏపీ 39జెడ్ 0826) సూపర్ లగ్జరీ బస్సు అదుపు తప్పి లారీని ఢీకొంది. బస్సు డ్రైవర్ క్షేమంగా ఉండగా లారీ డ్రైవర్ కడియం రామశేషుతోపాటు బస్సులోని 10 మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులు సత్యసాయి (కాకినాడ), కర్రి హారిక (రావులపాలెం), వి.రాజు (మాచవరం), సుబ్రహ్మణ్యం (కాకినాడ), కె.సురేష్ (కాకినాడ), జె.పవన్‌కుమార్ (కాకినాడ), వెంకటలక్ష్మి (రామచంద్రపురం), ఆరేపల్లి సాయి దుర్గాప్రసాద్ (తణుకు) వి.దత్తు నాయక్ (గుంటూరు), ఆకుల శివాజీ (కడియపులంక)లను ఏలూరు జీజీహెచ్‌కు తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. ఈ ప్రమాదంతో రెండు గంటలపాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. త్రీటౌన్, హైవే పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఏలూరు త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


ఏలూరులో రామచంద్ర ఇంజనీరింగ్ కాలేజీ సమీపంలో దెబ్బతిన్న ఆర్టీసీ బస్సు

బస్సును ఢీకొన్న లారీ

మరో ప్రమాదంలో ఆర్టీసీ బస్సును ట్రాలర్ లారీ వెనుక నుంచి ఢీకొంది. విశాఖ నుంచి విజయవాడ వెళుతున్న (ఏపీ16 జెడ్ 0641) ఆర్టీసీ బస్సు ఏలూరు జాతీయ రహదారిపై ప్రభుత్వ గురుకుల పాఠశాల సమీపానికి చేరుకునే సరికి వెనుక నుంచి లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సు వెనుక భాగం చాలా వరకూ దెబ్బతింది. ప్రమాద సమయంలో బస్సులో ప్రయాణికులు ఎవరూ లేదు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. లారీ, బస్సు డ్రైవర్లకు సైతం ఎలాంటి గాయాలు కాలేదు. ఏలూరు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బస్సుల ప్రమాదంతో కలకలం

ఏలూరు జాతీయ రహదారిపై ఆరు రోజుల్లో నాలుగు బస్సు ప్రమాదాలు చోటుచేసుకోవడం కలకలం రేపుతోంది. ఇటీవల చొదిమెళ్ల వద్ద జరిగిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ప్రమాదంలో నలుగురు మృతిచెందారు. అలాగే ఆశ్రం హాస్పిటల్ సమీపంలో మరో ట్రావెల్స్ బస్సు బోల్తా కొట్టగా ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. తాజాగా మరో రెండు ప్రమాదాలు జరగడం కలకలం రేపుతోంది.

గిరిజనుల ఆగ్రహం

- కన్నాపురం రేంజ్ కార్యాలయం ఎదుట ఆందోళన
- ఐటీడీఏ పీఓకు ఫిర్యాదు
- ఫారెస్ట్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్


కన్నాపురం రేంజ్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న యాకోబు కుటుంబ సభ్యులు


ఫారెస్ట్ అధికారుల చేతిలో దెబ్బలు తిని వైద్యం పొందుతున్న గిరిజనుడు

బుట్టాయగూడెం/కొయ్యలగూడెం: గుళ్లపూడికి చెందిన గిరిజనుడు మడకం యాకోబును ఫారెస్ట్ అధికారులు కొట్టిన వివాదం తారాస్థాయికి చేరుకుంది. అక్రమ కేసులు బనాయిస్తున్న ఫారెస్ట్ అధికారులపై చర్యలు తీసుకోవాలంటూ గిరిజనులు బుధవారం కన్నాపురం అటవీ శాఖ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఒకానొక సమయంలో ఆందోళనకారులను ఫారెస్ట్ అధికారులు అదుపు చేయలేకపోవడంతో కొయ్యలగూడెం ఎస్సై చంద్రశేఖర్, సిబ్బంది అక్కడికి చేరుకుని వారికి నచ్చజెప్పారు. అనంతరం యాకోబు కుటుంబ సభ్యులు ఐటీడీఏ పీఓ కె.రాములు నాయక్‌కు ఫిర్యాదు చేసి ఫారెస్ట్ అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బీట్ ఆఫీసర్‌పై ఆరోపణలు

మంగళవారం రాత్రి కలప తోలుతున్న ట్రాక్టర్‌లను ఫారెస్ట్ అధికారులు అడ్డుకున్నారు. ఆ సమయంలో హైడ్రాలిక్ ట్రాక్టర్ కావడంతో కలపను అక్కడే దించి అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తి పారిపోయాడు. అయితే ఆ ట్రాక్టర్ బాధితుడు యాకోబుది కావడంతో పోలీసులు కార్యాలయానికి రావాలని చెప్పడంతో అక్కడికి వెళ్లాడు. ఆ సమయంలో అటవీశాఖ సబ్ డీఎఫ్ఓ, ఇద్దరు గార్డ్‌లు తనను విచక్షణా రహితంగా బూట్లతో తన్నారని బాధితుడు తెలిపాడు. రూ. 50 వేలు సొమ్ములు తీసుకున్నప్పటికీ కూడా తనపై చేసిన దాడిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని యాకోబు డిమాండ్ చేస్తున్నారు.

మాకు న్యాయం చేయాలి

తన భర్త యాకోబును చితకబాదిన ఫారెస్ట్ అధికారులపై కఠిన చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని యాకోబు భార్య అనిత డిమాండ్ చేసింది. తన భర్తకు జరిగిన అన్యాయంపై ఆమె పీఓకు ఫిర్యాదు చేసింది. ఫారెస్ట్ అధికారులు కొట్టిన దెబ్బలకు తన భర్తకు పక్కటెముక విరిగిందని ప్రాణాపాయ స్థితిలో ఉన్న అతడిని బుట్టాయగూడెం పీహెచ్‌సీలో వైద్యం కోసం తీసుకువెళ్లగా అక్కడి నుంచి జంగారెడ్డిగూడెం పంపించారని చెప్పింది. తన భర్తను కొట్టి చంపడానికి ప్రయత్నించిన ఫారెస్ట్ అధికారులకు కఠిన చర్యలు తీసుకోవాలని అనిత డిమాండ్ చేసింది.

హైకోర్టులో సర్పంచ్ స్వర్ణలతకు ఊరట

- సస్పెన్షన్, నిధుల రికవరీ ఆదేశాలు తాత్కాలికంగా నిలుపుదల
- కలెక్టర్ ఉత్తర్వులతో పదవీ బాధ్యతలు చేపట్టిన సర్పంచ్


సర్పంచ్‌గా బాధ్యతలు చేపడుతున్న స్వర్ణలత

ద్వారకాతిరుమల: అవినీతి ఆరోపణల నేపథ్యంలో సస్పెన్షన్‌కు గురైన ద్వారకాతిరుమల సర్పంచ్ కుంటం స్వర్ణలతకు హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులతో ఊరట లభించింది. దీంతో తిరిగి ఆమె పంచాయతీ కార్యాలయంలో బుధవారం సర్పంచ్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారు. వివరాల్లోకి వెళితే.. స్థానిక పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై గ్రామానికి చెందిన నిమ్మగడ్డ అముక్త గతేడాది జనవరి 29న స్పందనలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ అధికారిగా జంగారెడ్డిగూడెం డీఎల్‌పీఓను నియమిస్తూ ఫిబ్రవరి 5న కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. విచారణ జరిపిన అధికారులు సర్పంచ్ రూ.53,57,376 నిధులను దుర్వినియోగం చేసినట్టు తేల్చారు. ఆ నిధుల రికవరీతో పాటు, 6 నెలల పాటు సస్పెన్షన్ ఎందుకు చేయకూడదో వివరణ ఇవ్వాలని అదే ఏడాది జూలై 29న సర్పంచ్‌కు షోకాజ్ నోటీసు జారీ చేశారు. అయితే తాను నిధుల దుర్వినియోగానికి పాల్పడలేదని, తనపై ఏవిధమైన చర్యలు తీసుకోవద్దని ఆగస్టు 9న వివరణ ఇచ్చారు. వివరణ సంతృప్తికరంగా లేకపోవడంతో సర్పంచ్ స్వర్ణలతను 6 నెలల పాటు సస్పెండ్ చేస్తూ, దుర్వినియోగం అయిన నిధులను 15 రోజుల లోపు చెల్లించాలని గతేడాది అక్టోబర్ 15న కలెక్టర్ ఉత్తర్వులిచ్చారు. ఆ చర్యలను తొలగించాలని కోరుతూ సర్పంచ్ హైకోర్టును ఆశ్రయించగా, తదుపరి విచారణ ముగిసే వరకు ఆమెపై ఉన్న చర్యలు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు అదేనెల 26 న కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ఆదేశాలను జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి అమలు చేస్తూ మంగళవారం ఉత్తర్వులిచ్చారు. దాంతో సర్పంచ్‌గా స్వర్ణలత బాధ్యతలు స్వీకరించారు.

ఏలూరులో సీఎంఆర్ జ్యూయలరీ ప్రారంభం


జ్యోతి ప్రజ్వలనతో సీఎంఆర్ జ్యూయలరీ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరులో సీఎంఆర్ జ్యూయలరీ షాపును సోమవారం సినీ నటి మీనాక్షి చౌదరి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎంఆర్ సంస్థ వ్యవస్థాపకుడు మావూరి వెంకటరమణ మాట్లాడుతూ తమ షోరూంలో వినియోగదారుల అభిరుచికి, శైలికి తగ్గట్టుగా ప్రాచీనత నుంచి ఆధునికత వరకు అన్ని రకాల ఆభరణాలు ఇక్కడ అందుబాటులో ఉంచామన్నారు. బంగారు ఆభరణాలపై అతి తక్కువ తరుగు 3 శాతం నుంచి ప్రారంభమౌతుందని, వెండి రెగ్యులర్ వస్తువులపై తరుగు మజూరీ లేదని తెలిపారు. షోరూమ్ ప్రారంభ కానుకగా గ్రాముకు రూ.300 వరకు తగ్గింపును ఈ నెల 30వ తేదీ వరకు ఇస్తున్నట్లు తెలిపారు. పారిశ్రామిక వేత్త అంబికా కృష్ణ మాట్లాడుతూ సీఎంఆర్ జ్యూయలరీ లాంటి పెద్ద సంస్థలు ఏలూరుకు రావడం వల్ల ఏలూరు ప్రజలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయన్నారు. వ్యాపారవేత్త వాసవి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే జీఎం తనిఖీలు

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ బుధవారం విజయవాడ డివిజన్‌లోని కాకినాడ–సామర్లకోట–రాజమండ్రి–నిడదవోలు–ఏలూరు సెక్షన్‌లలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. విజయవాడ రైల్వే డీఆర్ఎం నరేంద్ర ఎ.పాటిల్, ఇతర అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు జీఎంను కలుసుకుని తమ ప్రాంతాలకు సంబంధించిన పలు రైల్వే ప్రాజెక్టులపై వినతిపత్రాలు అందజేశారు. చివరిగా ఏలూరు స్టేషన్‌ను సందర్శించి అక్కడ ప్రయాణికుల సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు.

చీరకు నిప్పంటుకుని వృద్ధురాలి మృతి


సుబ్బాయమ్మ మృతదేహం

జంగారెడ్డిగూడెం: ప్రమాదశాత్తు చీరకు నిప్పంటుకున్న వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన జంగారెడ్డిగూడెంలో చోటుచేసుకుంది. ఎస్సై షేక్ జబీర్ తెలిపిన వివరాలివి. పట్టణంలోని గరుడపక్షి నగర్‌కు చెందిన భోగిరెడ్డి సుబ్బాయమ్మ (88) ఒంటరిగా నివిస్తోంది. బుధవారం ఇంట్లో వంట చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు ఆమె చీరకు నిప్పంటుకోవడంతో కాలిన గాయాలయ్యాయి. వృద్ధురాలు సుబ్బాయమ్మ కేకలు విన్న చుట్టుపక్కల వారు మంటలు ఆర్పి మనుమడు భోగిరెడ్డి సతీష్‌కుమార్‌కు తెలిపారు. వెంటనే వృద్ధురాలిని అంబులెన్స్‌లో జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తీసుకు వెళ్లగా అక్కడ ప్రాథమిక చికిత్స అందించి, అనంతరం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం ఆమె మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. ఆసుపత్రి సమాచారం, మనుమడు సతీష్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

ఆంధ్రా సుగర్స్‌లో భద్రతా నియమాలు భేష్


విజేతకు బహుమతి అందిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: ప్రభుత్వం నిర్దేశించిన సున్నా ప్రమాదాల లక్ష్యాన్ని సాధించాలంటే కార్మికులంతా విధిగా భద్రతా నియమాలను పాటించాలని డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కె.శ్రీనివాసరావు పేర్కొన్నారు. వెంకటరాయపురంలోని ది ఆంధ్రా సుగర్స్ లిమిటెడ్ సంస్థలో బుధవారం నిర్వహించిన 54వ జాతీయ భద్రతా వారోత్సవ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నిబంధనలను పాటిస్తూ గతేడాదిలో ఒక్క ప్రమాదం కూడా జరగకుండా చర్యలు తీసుకున్న ఆంధ్రా సుగర్స్ యాజమాన్యాన్ని అభినందించారు. వారోత్సవాల్లో భాగంగా శ్రీతిమ్మరాజు స్కూల్స్, శ్రీముళ్లపూడి వెంకటరాయ మెమోరియల్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఇనస్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ బి.రామకృష్ణ, పరిశ్రమ భద్రతా అధికారి ఎంఎస్‌వీవీ రామకృష్ణ, జనరల్ మేనేజరు (హెచ్ఆర్) ఎ.సాంబశివరావు పాల్గొన్నారు.

అటవీ సిబ్బందిని అడ్డుకున్న గ్రామస్తులు


చటాకాయిలో టెంట్లు వేసి గ్రామస్తుల నిరసన

కైకలూరు: కొల్లేరు ఆపరేషన్‌లో భాగంగా చటాకాయిలో చెరువులకు గండ్లు కొట్టడానికి వెళ్లిన అటవీ సిబ్బందిని గ్రామస్తులు అడ్డుకుని నిరసన తెలిపారు. గ్రామంలోని ప్రభుత్వ భూమిలో 40 ఎకరాలు, 16 ఎకరాలు వెరసి 56 ఎకరాల్లో రెండు చెరువులను ధ్వంసం చేయాల్సి ఉంది. బుధవారం 9 మంది అటవీ సిబ్బంది చెరువులకు గండ్లు కొట్టడానికి చటాకాయి వెళ్లగా గ్రామస్తులు టెంట్లు వేసి నిరసన వ్యక్తం చేశారు. మా చెరువుల జోలికి వస్తే ఊరుకునేది లేదని తెగేసి చెప్పారు. కొల్లేరు ఆపరేషన్ సమయంలో కైకలూరు, మండవల్లి మండలాల్లో 7,500 ఎకరాలు అదనంగా ధ్వంసం చేశారని వాటిని ముందుగా పంపిణీ చేయాలని మెలిక పెట్టారు. దీంతో అటవీశాఖ అధికారులు చేసేది ఏమీలేక వెనక్కి మళ్లారు.

చాట్రాయి తహసీల్దార్ సస్పెన్షన్

చాట్రాయి: చాట్రాయి తహసీల్దార్ డి ప్రశాంతిపై అవినీతి ఆరోపణలు రుజువు కావడంతో ఆమెను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ కలెక్టర్ వెట్రిసెల్వి ఉత్తర్వులు జారీచేసినట్లు సమాచారం. నూజివీడు సబ్‌కలెక్టర్ స్మరణ్‌రాజు విచారణలో అవినీతి ఆరోపణలు, భూముల అక్రమ ఆన్‌లైన్‌లో భాగంగా తహసీల్దార్‌కు రెండు సార్లు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. ఆమెపై అవినీతి ఆరోపణలు రుజువుకావడంతో జిల్లా అధికారులు సస్పెండ్ చేసినట్లు తెలిసింది.

పంచారామక్షేత్రం హుండీల ఆదాయం రూ.12.65 లక్షలు


పంచారామక్షేత్ర హుండీలను లెక్కిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశం చౌక్): పంచారామ క్షేత్రం శ్రీఉమాసోమేశ్వర జనార్దనస్వామి వారి దేవస్థానం హుండీల ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. గత 93 రోజుల కాలంలో భక్తులు స్వామి వారికి సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.12,65,994 లభించినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి డి.కృష్ణంరాజు తెలిపారు. అలాగే అన్నదానం నిమిత్తం రూ.23,337 విరాళం అందినట్లు చెప్పారు. ఈవో కె.శ్రీనివాసరావు, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి దగాపై నిరసన సెగ

- పేద విద్యార్థుల విద్యపై కూటమి కుట్ర
- విద్యార్థులు, యువత, నిరుద్యోగులకు ఇచ్చిన హామీల అమలెక్కడ
- వైఎస్సార్ సీపీ యువత పోరులో మాజీ మంత్రులు కొట్టు, కారుమూరి
- యువత పోరుకు కళాశాలల విద్యార్థుల మద్దతు



తణుకులో మాట్లాడుతున్న మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు


యువత పోరు కార్యక్రమానికి భీమవరం వెళ్తున్న మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ

తణుకు అర్బన్: పేద విద్యార్థుల విద్యపై కూటమి ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తుందని మాజీమంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. వైఎస్సార్ సీపీ యువత పోరు కార్యక్రమంలో భాగంగా బుధవారం తణుకు రాష్ట్రపతి రోడ్డులో నిర్వహించిన ర్యాలీని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. పేదల విద్యకు కూటమి ప్రభుత్వం ఆటంకాలు సృష్టిస్తుందని, విద్యావిధానంపై చంద్రబాబు వ్యవహారం అనుమానాస్పదంగా ఉందని, విద్యార్థుల తల్లితండ్రులు ఫీజులు చెల్లించలేక అప్పులపాలైపోతున్నారని విమర్శించారు. చదువులు పూర్తైన విద్యార్థులు తమ ధ్రువపత్రాల కోసం ఫీజు బకాయిలు చెల్లిస్తేనే కానీ ఇవ్వని పరిస్థితి నేడు దాపురించిందని దుయ్యబట్టారు. గత ఐదేళ్ల ఎంత చదువుకుంటే అంతా ఉచితంగానే, సమయానికి విద్యాదీవెన పథకం ద్వారా తల్లిదండ్రుల బ్యాంక్ ఖాతాలకు జమచేశారని, కూటమి ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు పూర్తైనా ఇంతవరకు ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు చెల్లింపులు చేయలేదని ఎద్దేవా చేశారు. విద్యార్థులు, యువత, నిరుద్యోగులు కూటమి ప్రభుత్వం తీరుకు నానాయాతన పడుతున్నారని స్పష్టం చేశారు.

వైఎస్సార్‌సీపీ యువత పోరుకు కళాశాలల విద్యార్థుల మద్దతు

వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు వైఎస్సార్ సీపీ యువత పోరు కార్యక్రమంలో భాగంగా బుధవారం తణుకు వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి మాజీమంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పార్టీ శ్రేణులతో కలిసి భీమవరం వెళ్లేందుకు ర్యాలీగా బయలుదేరారు. ఈ క్రమంలో రాష్ట్రపతి రోడ్డులోని శ్రీచిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాల ముందు వైఎస్సార్ విద్యార్థి విభాగం తణుకు నియోజకవర్గ అధ్యక్షుడు గోపే ఎడ్వర్డ్‌పాల్, ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి, ఆంధ్రా విద్యార్థి సంఘం నాయకులు చెట్టే సుశాంత్‌ల ఆధ్వర్యంలో వివిధ కళాశాలల విద్యార్థులు, విద్యార్థినులు ర్యాలీకి తమ మద్దతు పలికారు. ఈ సందర్భంగా విద్యార్థినులు మాజీమంత్రి కారుమూరికి కుంకుమ అద్ది హారతులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి, జిల్లా సెక్రటరీ ఆర్గనైజేషన్ యిండుగపల్లి బలరామకృష్ణ, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు పొట్ల సురేష్, నియోజకవర్గ మహిళాధ్యక్షురాలు మెహర్ అన్సారీ, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనక దుర్గ, నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షురాలు షేక్ ఫహీమా, వి.సీతారాం పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై వైఎస్సార్ సీపీ పోరాటం

తాడేపల్లిగూడెం అర్బన్ : కూటమి నేతలు విద్యారంగానికి, యువతకు నిరుద్యోగులకు, మహిళలకు ఇచ్చిన హామీలు తుంగలోకి తొక్కారని మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ యువత పోరు కార్యక్రమాన్ని బుధవారం ఆయన క్యాంపు కార్యాలయం వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు మేలు చేయాలనే ఉద్దేశ్యంతో ×యువత పోరు₹ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో ఎన్నో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారన్నారు. విద్యార్థులు కోసం అనేక పథకాలు అమలు చేయడం ద్వారా పాఠశాల విద్య నుంచి కళాశాలల వరకూ అభివృద్ధి పథంలో నడిపించారన్నారు. సంక్షేమ పథకాలను అమలు చేయడంలో దేశానికి ఆదర్శంగా వైఎస్ జగన్‌మోహనరెడ్డి ఇప్పటికీ నిలిచారన్నారు. జగన్ అందించిన పథకాలకు మించి రాష్ట్ర ప్రజలకు సంక్షేమాన్ని అందిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఎప్పటికీ మోసగాడే గానే నిలిచాడని విమర్శించారు. రాజన్న రామరాజ్యం మళ్లీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. భవిష్యత్తులో చంద్రబాబుకు ప్రజలే మళ్లీ గుణపాఠం చెప్పి వైఎస్ జగన్‌మోహనరెడ్డిని ముఖ్యమంత్రిని చేస్తారన్నారు. అనంతరం యువత పోరు కార్యక్రమాన్ని ప్రారంభించి విద్యార్థులు, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో భీమవరం చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొలుకులూరి ధర్మరాజు, కర్రి భాస్కరరావు, ముప్పిడి సంపత్‌కుమార్, రూరల్ మండల అధ్యక్షురాలు నూనె అనూరాధ, మస్తాన్ బీబీ, అరిగెల అభిషేక్, బండారు నాగు, చెన్నా జనార్ధన్, కొవ్వూరి భాస్కరరెడ్డి, తమ్మిశెట్టి, జిడ్డు హరిబాబు, కైగాల శ్రీనివాస్, రెడ్డి సూరిబాబు, పరమాత్మ, కేశాని అశోక్, చామన సూర్యచంద్రరావు పార్టీ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

3ఎఫ్ ఇండస్ట్రీపై ఆరోపణలు సరికావు

ఐటీ తనిఖీలపై స్పందించిన యాజమాన్యం


సమావేశంలో మాట్లాడుతున్న కంపెనీ ప్రతినిధులు

పెంటపాడు: మండలంలోని ప్రత్తిపాడు 3ఎఫ్ కర్మాగారంలో ఐటీ దాడులు... అంటూ ఆరోపణలలో వాస్తవం లేదని 3ఎఫ్ ఇండస్ట్రీ యాజమాన్యం స్పష్టం చేసింది. ఈ సందర్భంగా సంస్థ హెచ్‌ఆర్ మేనేజర్ జె. జనార్ధన్, ఎకౌంట్స్ జీఎం ఎంఎస్ వేణుగోపాల్‌లు బుధవారం సంయుక్తంగా మాట్లాడుతూ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 6 నుంచి 10వ తేదీవరకు ప్రత్తిపాడు ఫ్యాక్టరీలో ఆదాయపన్ను శాఖ సోదాలు జరిగాయన్నారు. కాగా దీనికి సంబంధించి ముందుగా ముంబైలోని పార్లే ప్రొడక్ట్ ప్రేవైట్ లిమిటెడ్‌లో ఆదాయపు పన్ను శాఖ తనిఖీలు చేసారన్నారు. దానిలో భాగంగా ఆ సంస్థకు తమ సంస్థ నుంచి రిఫైండ్ పామాయిల్ గత కొన్నేళ్లుగా సరఫరా చేస్తున్న సంస్థల్లో ఒకటి కావడం వల్ల దానిని నిర్ధారణ చేసుకొనే పనిలో ద్వితీయ విచారణలో భాగంగా ఐటీ సోదాలు జరిగాయన్నారు. అంతే గాని పార్లే కంపెనీకి సంబంధించి ఆర్థిక లావాదేవీల గురించి ఐటీ అధికారులు సమాచారం సేకరించడంతో అధికారులకు తమ యాజమాన్యం పూర్తి సహాయసహకారాలు అందించి సమాచారం ఇచ్చామన్నారు.

పది విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం

తణుకు అర్బన్: పదో తరగతి విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు తణుకు డిపో మేనేజరు సప్పా గిరిధర్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు తమ హాల్ టిక్కెట్ చూపిస్తే బస్సులో ఉచితంగా ప్రయాణం చేయవచ్చని చెప్పారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

క్లుప్తంగా

ఆదర్శనీయుడు మాజీ ఎమ్మెల్యే చిట్టూరి


మాజీ ఎమ్మెల్యే చిట్టూరి వెంకటేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీమంత్రి కారుమూరి

తణుకు అర్బన్: మాజీ ఎమ్మెల్యే చిట్టూరి వెంకటేశ్వరరావు ఆదర్శనీయుడని మాజీమంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. బుధవారం ఇటీవల మరణించిన వెంకటేశ్వరరావు నివాసానికి వెళ్లిన కారుమూరి వారి కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. శాసనసభ్యులుగాను, లయన్స్ క్లబ్ ప్రతినిధిగా ఆయన సమాజానికి ఎంతో సేవ చేశారని గుర్తు చేశారు.

రామన్నగూడెంలో పాడి పశువులకు టీకాలు


రామన్నగూడెం గ్రామంలో పాడి పశువులకు టీకాలు వేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని రామన్నగూడెం గ్రామంలో బుధవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో 143 ఆవులు, 258 గేదెలకు టీకాలు వేశారు. గురువారం కడియద్ద గ్రామంలో గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమం నిర్వహించనున్నట్లు డాక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు


బాల సదన్‌లో మైనర్ బాలికతో ఐసీడీఎస్, పోలీస్, ఎం.ఎస్.కే తదితరులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని 10వ వార్డుకు చెందిన మైనర్ బాలిక(16)కు మంగవారం రాత్రి వివాహం చేసేందుకు నిశ్చయించగా ఐసీడీఎస్, పోలీస్, అంగన్‌వాడీ సిబ్బంది అడ్డుకున్నారు. బాలికను తణుకు బాలసదన్‌కు, అక్కడ నుంచి ఏలూరు సీడబ్ల్యూసీ హోంకు పంపించినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజ్ దుర్గ భవాని తెలిపారు. ఈ సందర్భంగా బాల వివాహ నిరోధక చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కె.లక్ష్మి బాయ్, మైనర్ తల్లి, పోలీస్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఆహారం పంపిణీ


తణుకులో ఆహారం అందజేసిన కారుమంచి ఫౌండేషన్ సభ్యులు

తణుకు అర్బన్: కారుమంచి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నో ఫుడ్ వేస్ట్ కార్యక్రమంలో భాగంగా బుధవారం సావరం గ్రామంలో ఒక వివాహ శుభకార్యంలో మిగిలిన ఆహారాన్ని పంచడం తణుకు ప్రాంతంలోని పేదలకు అందజేసినట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కారుమంచి యోహాన్ తెలిపారు. ఎవరైనా మీ ఫంక్షన్స్‌లో మిగిలిన ఆహారాన్ని వృథా చేయకుండా కారుమంచి ఫౌండేషన్ నంబర్ 9182176611కు తెలియపరిస్తే ఆహారాన్ని పేదలకు అందిస్తామని చెప్పారు. ఆహారాన్ని అందించిన సత్తి వారి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు ఉండ్రాజవరపు రామ్ చరణ్, ముప్పిడి వినీత్, ఉండ్రాజవరపు బెన్ను, సాయి, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా రైతులను ఆదుకోవాలి

పాలకొల్లు సెంట్రల్: జిల్లాలో ఆక్వా రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక తీవ్ర ఆవేదనకు గురవుతున్నారని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆక్వా రైతులను ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు బి.బలరాం అన్నారు. బుధవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఫీడ్‌లో నాణ్యత లేకపోవడంతో తీవ్ర సమస్యను ఎదుర్కొంటున్నారని అన్నారు. గత నెల వరకూ కిలో రూ. 280 ఉండేదని గత పది రోజులుగా కిలో ధర రూ. 230 కి పడిపోయిందని తెలిపారు. ఆక్వా రైతు ఇలా టన్నుకు సుమారు రూ. 50 వేల వరకూ నష్టపోతున్నారన్నారు. ఫీడ్‌కు సంబంధించిన ముడి సరుకు ధరలు తగ్గినా ఫీడ్ ధరలు మాత్రం దారుణంగా పెంచేశారన్నారు. ప్రభుత్వం పంటలను ఎలా కొనుగోలు చేస్తుందో ఆక్వాను కూడా అలానే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

వైఎస్సార్ సీపీతోనే ప్రజా సంక్షేమం


మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీమంత్రి కారుమూరి


అత్తిలిలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

పార్టీ కార్యాలయం వద్ద పార్టీ జెండా ఆవిష్కరించిన కారుమూరి

తణుకు అర్బన్: పేదప్రజల సమస్యల పరిష్కారం కోసమే వైఎస్సార్ సీపీ ఉద్భవించిందని మాజీమంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం తణుకు వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. పేదలకు అండగా నిలబడాలనే ఉద్దేశ్యంతోనే పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 15 ఏళ్ల నాడు పార్టీని ఏర్పాటు చేశారని అన్నారు. ప్రజలకు అనుకూలంగా అప్పటి ప్రభుత్వంపై నిర్వహించిన పోరాటాల ఫలితంగా ప్రజలకు అండగా నిలబడ్డారని, ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న వెంటనే ఎన్నో సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుని పేదప్రజలను సంక్షేమంతో ఆదుకున్నారని గుర్తుచేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమాన్ని అందించి, విద్య, వైద్యానికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చారని స్పష్టం చేశారు. ముఖ్యంగా రైతాంగానికి వెన్నుదన్నుగా నిలబడి ఆర్‌బీకేలు ఏర్పాటుచేసి దళారుల వ్యవస్థకు మంగళంపాడి కిట్టుబాటు ధరను అందజేశారని కొనియాడారు. అర్హత ఉంటే చాలు సంక్షేమం ఇంటికి పంపించి ప్రజల గుండెల్లో వైఎస్ జగన్ గూడుకట్టుకున్నారని అన్నారు. ఈ సందర్భంగా మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి, యిండుగపల్లి బలరామకృష్ణ, పొట్ల సురేష్, చోడే గోపికృష్ణ, వి.సీతారాం, మెహర్ అన్సారీ, నత్తా కృష్ణవేణి, నూకల కనకదుర్గ, ఉండవల్లి జానకి, బెజ్జవరపు హేమశ్రీ, షేక్ ఫహీమా, చింతలపూడి సూర్యనారాయణ, ఎస్వీ జాకబ్‌బాబు, పుల్లెపు సూర్యచంద్రరావు, షేక్ జిలాని, ఝాన్సీ లారెన్స్, రంభ నాగేశ్వరరావు, కొఠారు రామాంజనేయులు, గారపాటి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం.

అత్తిలి: ప్రజలకు సుపరిపాలన అందించేందుకు వైఎస్సార్ సీపీ ఆవిర్భవించిందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ అన్నారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం అత్తిలి వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా పైబోయిన సత్యనారాయణ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు మేలు చేయాలనే లక్ష్యంగా నాడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పార్టీని ఏర్పాటు చేసారన్నారు. గత వైఎస్సార్ సీపీ పాలనలో అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించి ప్రజల మన్ననలు పొందారన్నారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, జడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, వైఎస్సార్ సీపీ ఎంప్లాయిస్, పెన్షనర్స్ విభాగం జిల్లా అధ్యక్షుడు పెన్మెత్స రామరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఇరగవరం: మండలంలోని అన్ని గ్రామాల్లో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి కంప్యూటర్ అందజేత


తణుకులో విద్యార్థినికి కంప్యూటర్ అందజేసిన మానవత సంస్థ ప్రతినిధులు

తణుకు అర్బన్: తణుకు మానవత సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన అమెరికన్ టెలిఫోన్ అండ్ టెలి కమ్యూనికేషన్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సౌజన్యంతో హెచ్‌పీ కంప్యూటర్ సిస్టమ్‌ను తణుకుకు చెందిన ఎంసీఏ విద్యార్థిని చింతకాయల హేమ ప్రియాంకకు అందజేసినట్లు మానవత రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ కోడూరి రాధా పుష్పవతి తెలిపారు. సంస్థలో ఇంజనీర్లుగా విధులు నిర్వర్తిస్తున్న కోడూరి నాగగోపాల శ్రీనివాసరావు, పిసిని సత్యనారాయణ ఆధ్వర్యంలో కంప్యూటర్ తణుకు చేరిందని వారికి ప్రత్యేక కృతజ్ఞతలు చెబుతున్నామని అన్నారు. ఇప్పటివరకు తణుకు చుట్టుపక్కల గ్రామాల్లో ఉన్న వారికి 8 కంప్యూటర్లు అందజేసినట్లు వివరించారు. బుధవారం తణుకు రోటరీ క్లబ్‌లో మానవత సంస్థ అధ్యక్షురాలు కఠారి శారదాదేవి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కంప్యూటర్‌ను అందజేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా శ్యాంతి ర్యాలీ కమిటీ చైర్మన్ గమిని రాంబాబు, కార్యదర్శి బొల్లం రామ కాశి, కోశాధికారి అక్కెన కాశీ విశ్వనాథం, విశిష్ట దాత చిట్టూరి సుజాత, తణుకు మండలం అభివృద్ధి కమిటీ చైర్మన్ కటారి కాశీ విశ్వనాథరాజు, పూర్వపు అధ్యక్షులు ఆలపాటి సుబ్బారావు, మానవతా సభ్యులు దాట్ల సత్యనారాయణ రాజు, సంకు మనోరమ, ఆకెళ్ళ సుబ్రహ్మణ్యం, సభ్యులు పాల్గొన్నారు.

యువత పోరు కార్యక్రమానికి సంఘీభావం

అత్తిలి: కూటమి ప్రభుత్వం విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన యువత పోరు కార్యక్రమానికి అత్తిలి మండలం నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు కార్లలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా అత్తిలి డిగ్రీకళాశాల విద్యార్థులు ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఇవ్వాలని, విద్యదీవెన, వసతి దీవెన పథకాలను అమలు చేయాలని కోరుతూ కరపత్రాలు చేత బట్టి నినాదాలు చేస్తూ వైఎస్సార్ సీపీ చేపట్టిన యువత పోరు కార్యక్రమానికి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో అత్తిలి మాజీ ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, మండలపార్టీ అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, జడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, ఎంప్లాయిస్, పెన్సనర్స్ విభాగం జిల్లా అధ్యక్షుడు పెన్మెత్స రామరాజు, మండలపార్టీనాయకులు గారపాటి నాగరాజు, కసిరెడ్డి బాలాజీ, కోరుకొల్లు వెంకట్రావు, గుండుమోగుల సత్యనారాయణ, కంకటాల సతీష్, రామిశెట్టి రాము తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా మదనగోపాలుడి పొన్నవాహన గ్రామోత్సవం


అత్తిలి : బల్లిపాడులో మదనగోపాలస్వామి పొన్నవాహన గ్రామోత్సవ దృశ్యం


బల్లిపాడులో కాంతారా నృత్య ప్రదర్శన దృశ్యాలు

అత్తిలి: మండలంలోని బల్లిపాడు గ్రామంలో రుక్మిణీ, సత్యభామా సమేత మదనగోపాలస్వామి కల్యాణ మహోత్సవాలలో భాగంగా స్వామివారి పొన్నవాహన గ్రామోత్సవం అత్యంత వైభవోపేతంగా జరిగింది. పుష్పాలు, విద్యుత్ దీపాలతో అలంకరించిన పొన్నవాహనంపై స్వామి అమ్మవార్లను సన్నాయి, బ్యాండు మేళాలు, బుట్టబొమ్మలు, కాంతారా నృత్య ప్రదర్శనలు, కేరళ డప్పువాయిద్యాల నడుమ స్వామివారి పొన్నవాహన గ్రామోత్సవం నేత్రపర్వంగా నిర్వహించారు. ద్రాక్షారామం వారిచే కాల్చిన బాణా సంచా కాల్పులు ఉత్సవాలలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. జిల్లా పలు ప్రాంతాలనుంచి వేలాది మంది భక్తులు హాజరై గ్రామోత్సవాన్ని తిలకించారు. ఉత్సవాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అత్తిలి ఎస్సై పి ప్రేమరాజు పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఎల్ లోక్‌నాథ్ శ్రీనివాస్, ఉత్సవ కమిటీ సభ్యులు గారపాటి వెంకట సుబ్బారావు, గారపాటి శివకృష్ణ అశోక్, బుద్దాల భాస్కరరావు, ఆకుల వెంకటేశ్వరరావు, తోట నాగ వెంకట శివ గణేష్, ప్రగడ నాగ వెంకట శివదుర్గ గణేష్, గూనా పవన్ మణికంఠ గోపాలకృష్ణ, గునుపూడి నరేష్, పెచ్చెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రాముల వారి విగ్రహ ప్రతిష్ఠ


పూర్ణాహుతిలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డి రఘురాం నాయుడు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఆరుళ్ల గ్రామంలో పునఃనిర్మించిన కోదండ రామాలయంలో స్వామివారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మకర్త మాకరాజు సతీష్ - సుధశ్రీ దంపతులు పీటలపై కూర్చొని పూర్ణాహుతి కార్యక్రమం జరిపారు. అనంతరం గోదృష్టి, స్వామివారి దర్శన భాగ్యాన్ని భక్తులకు కల్పించారు. స్వామివారిని వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డి రఘురాం నాయుడు, జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు దర్శించుకున్నారు. స్వామివారి కృపాకటాక్షలు నియోజకవర్గ ప్రజలకు కలగాలని వడ్డి రఘురాం నాయుడు ఆకాంక్షించారు. అనంతరం ఆలయం వద్ద అఖండ అన్నసమారాధన నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి, స్వామి అమ్మవార్లను దర్శించి, అన్నప్రసాదాన్ని స్వీకరించారు. వైఎస్సార్ సీపీ సేవాదళ్ మండల చైర్మన్ కొండు బోయిన కృపావరం, నాయకులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం


పరిశుభ్రతపై పట్టణంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): పరిసరాల పరిశుభ్రతతో మనం ఆరోగ్యంగా ఉంటామని సబ్ యూనిట్ అధికారి వై.వీ.లక్ష్మణరావు అన్నారు. సబ్ యూనిట్ పరిధిలో బుధవారం బేబి సెంటర్ సమీపంలోని అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో 26వ వార్డు పరిసరాలలో వెక్టార్ కంట్రోల్ హైజీన్, క్షేత్ర స్థాయి పరిశీలనలు, ప్రజా అవగాహన కార్యక్రమాలు జరిగాయి. ప్రజారోగ్య పరిరక్షణకు సిబ్బందికి పలు సూచనలు చేశారు. దోమలు వ్యాప్తి వేగంగా జరుగుతుందని, ప్రజల భాగస్వామ్యంతో దోమలను నివారించ వచ్చునని చెప్పారు. లార్వాలను కొనుగొనుటలో సిబ్బందికి సూచనలు అందజేశారు. స్థానిక మునిసిపల్ ప్రైమరీ పాఠశాలలను సందర్శించి కీటక జనిత వ్యాధులపై అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రత ఎంతో అవసరం అన్నారు. అనుమానిత జ్వర లక్షణాలు ఉంటే ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలను సంప్రదించాలని, ప్రాథమిక నిర్ధారణ పరీక్షలు పట్టణ ఆరోగ్య కేంద్రాలలో అందుబాటులో ఉన్నాయని, ప్రజలందరూ ఈ సేవలను ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు, పాఠశాల విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అన్ని సమస్యలు పరిష్కరించాలి


పట్టణంలో ప్రజా చైతన్యయాత్ర, పాల్గొన్న ప్రజలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): అర్హులైన నిరుపేదలందరికీ ఇళ్ల స్థలాలు, ఇళ్లతో పాటు గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వీ గోపాలన్ డిమాండ్ చేశారు. ప్రజా చైతన్య సైకిల్ యాత్ర మంగళవారం రాత్రి తాడేపల్లిగూడెం చేరింది. పట్టణ కమిటీ స్వాగతం పలికారు. పట్టణ పరిధిలోని టిడ్కో ఇల్లు, జగనన్న కాలనీ, కేఎస్ఎన్ కాలనీలను సందర్శించి అనంతరం బుధవారం ఉదయం యాగర్లపల్లిలలో సైకిల్ యాత్ర జరిగింది. యాత్ర బృందం ఆయా ప్రాంతాల ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గోపాలన్ మాట్లాడుతూ అర్హులైన వారికి గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాలలో రెండు సెంట్లు భూమి ఇవ్వాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు, సభ్యులు కర్రి నాగేశ్వరరావు, చింతకాయల బాబూరావు, కరెడ్ల రామకృష్ణ, జవ్వాది శ్రీను, శిద్ధిరెడ్డి శేషుబాబు, పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక వైద్యుల రాక

పెంటపాడు: అలంపురం వెంకటరమణ చారిటీ ఆసుపత్రికి ఈనెల 13న ప్రత్యేక వైద్యులు రానున్నట్లు ట్రస్టుపతినిధి కొలనువాడ పెదకృష్ణంరాజు ఒక ప్రకటనలో తెలిపారు. పరిసర గ్రామాల ప్రజలు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): నియోజకవర్గంలోని తాడేపల్లిగూడెం టౌన్, పెంటపాడులలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. టౌన్‌లోని ఐదు సెంటర్‌లు శ్రీవాసవి, ఆదిత్య, జీఎంఆర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, డీఆర్ గోయెంకా ఉమెన్స్ జూనియర్ కళాశాలలోను, పెంటపాడులో ఒక సెంటర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షలు నిర్వహించగా బుధవారం ఫిజిక్స్-2, ఎకానమిక్స్-2 పరీక్షలు జరిగాయి.